# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.
- ❖ అఖిల భారత పశు గణనలో భాగంగా ఈరోజు నుంచి పశువుల వివరాల నమోదును చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖా మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ సుస్థిర పర్యాటకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- ❖ తిరుమలకు కాలి నడకన వచ్చే భక్తుల ఆరోగ్య దృష్ట్యా తిరుమల తిరుపతి దేవస్థానం పలు సూచనలు చేసింది.

====================

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ దీపావళి నుండి ప్రభుత్వం 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నెల 31వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంచనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, తదుపరి వెంటనే ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ అందించనున్నామని తెలిపారు. ఎల్.పి.జి. కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

====================

అఖిల భారత పశు గణనలో భాగంగా ఈరోజు నుంచి పశువుల వివరాల నమోదును చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా పెద్ద బమ్మిడి గ్రామంలో పశు

గణన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ... వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన పశువుల వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు పశుసంవర్ధక రంగం ప్రధాన ఆదాయవనరుగా ఉందని, దానిని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఈ గణన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

====================

పర్యావరణ పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తున్న కేంద్ర ప్రభుత్వం, “స్వచ్ఛతా హీ సేవా” పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా అక్రమంగా దిగుమతి చేసిన 73.71 లక్షల సిగరెట్లను గుంటూరులో, అలాగే విశాఖలో స్వాధీనం చేసుకున్న 9 లక్షల సిగరెట్లను జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్ మెంట్ లిమిటెడ్ ప్లాంట్ లో కస్టమ్స్ అధికారులు ధ్వంసం చేశారు. అలాగే విజయవాడ, నెల్లూరు, కాకినాడ, తిరుపతిలో కూడా  కస్టమ్స్ అధికారులు స్వాధీనపరచుకున్న సిగరెట్లను ద్వంసం చేసారు. ద్వంసం చేసిన సిగరెట్ల విలువ 5.50 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

విరామం

====================

తిరుమలకు కాలి నడకన వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు సూచనలు చేసింది. కాలి నడకన వచ్చే భక్తుల్లో కొందరు అస్వస్థతకు గురైన సంఘటనలు చోటు చేసుకుంటున్న క్రమంలో ఆరోగ్య సమస్యలు ఉన్న వాళ్లు మెట్ల మార్గాన్ని ఎంచుకోకూడదని, ఒకవేళ రావాల్సి వస్తే, పలు  జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల వ్యాధులు ఉన్న భక్తులు తిరుమలకు కాలినడకన రావడం మంచిది కాదని పేర్కొంది. కాలినడకన వచ్చే భక్తులకు ఏమైనా సమస్యలు ఎదురైతే అలిపిరి కాలిబాట మార్గంలోని 1500ల మెట్టు, గాలి గోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చునని తెలిపింది. అలాగే తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి, ఇతర వైద్యశాలల్లో 24 గంటల పాటు వైద్య సదుపాయం పొందవచ్చునని పేర్కొంది.

====================

రాష్ట్ర  ప్రభుత్వం సుస్థిర పర్యాటకంపై దృష్టి సారిస్తోందని పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఈరోజు విశాఖపట్నంలో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం & ట్రావెల్ సదస్సులో ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలోని ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్తే 3, 4 రోజులు అక్కడే ఉండేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీని వల్ల రెవెన్యూ పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందరికీ అనుకూలంగా ఉండేలా త్వరలో టూరిజం పాలసీ తీసుకొస్తామని తెలియజేశారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద రాష్ట్రానికి వెయ్యి కోట్ల రూపాయలను కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని అన్నారు.  రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలపై అందరూ కలిసి ప్రచారం చేయాలని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

విజయనగరం జిల్లాకు ఉపాధిహామీ పథకం కింద 350 కోట్ల రూపాయల  నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, వీటితో గ్రామాలకు రోడ్లు వంటి మౌలిక వసతులను  కల్పించనున్నామని రాష్ట్ర చిన్న మధ్యతరహా  పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈరోజు విజయనగరంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... వెండార్‌షిప్ ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ... ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారమే అధికారులు ఉపాధి పనులు చేపడతారని పేర్కొన్నారు.

=====================

పల్నాడు జిల్లా దాచేపల్లిలోని డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉన్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు దాచేపల్లిలోని అంజనాపురం కాలనీలో మంచినీటి పైపులైను పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, డయేరియాతో ఒక్కరు కూడా చనిపోలేదని, కడుపులో నొప్పితో 17 మంది ఆసుపత్రిలో చేరారని అన్నారు. ఇతర అనారోగ్య కారణాలతో ఇద్దరు మరణించారని, మరో ఏడుగురు ఇంటిలోనే చికిత్స పొందుతున్నారని మంత్రి తెలిపారు. అంజనాపురం కాలనీలో 25 లక్షల రూపాయల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మిస్తారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రజలకు మంత్రి హామీ ఇచ్చారు.

=====================

దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్లు, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని బాపట్ల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుషార్ డూడి తెలియజేశారు. ఈరోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని స్టేషన్ ల పరిధిలోని పోలీస్ అధికారులు ఆయా స్టేషన్ల పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాలను, విక్రయ దుకాణాలను, నిల్వ ఉంచిన గోడౌన్ లను సందర్శించి లైసెన్స్ లు తనిఖీ చేసి పరిశీలించాలన్నారు.

=====================
=====================